
# వెలగని దీపాలు




## మాధవి

చీకటి చిక్కబడింది
 వీధిదీపాలు గుడ్డిగా వెలుగుతున్నాయి
నారయ్య ఇంటిదీపం ఎందువల్లనో

క్రితం రాత్రినుంచి వెలగటంలేదు.
అసలు నారయ్యకు ఇల్లులేదు ఆ దీప
స్తంభమే అతని ఇల్లు నారయ్య కాపురం

అక్కడే అక్కడే తింటాడు అక్కడే పడుకొంటాడు అందుకే వీధి దీపంకాదు నారయ్య ఇంటిదీపం

రోడ్డువారగా ఉంది ఓ మర్రిచెట్టు ఆ మర్రిచెట్టే నారయ్యను ఎండనుండి రక్షిస్తోంది వానాకాలం నారయ్య తన మకాంని బ్రిడ్జికిందకి మారుస్తాడు

ఇంకా వానాకాలం ప్రవేశించలేదు అడపాదడపా ఎప్పుడో ఓ చినుకు పడుతోంది

అంతకుముందే రెండు చినుకులు రాలాయి

వానొస్తుందేమో అనుకొన్నాడు నారయ్య

కూర్చున్నవాడల్లా తలెత్తి ఆకాశం కేసి చూశాడు నల్లగా, కాటుక పూసినట్టుగా ఉంది

మెల్లగా లేచి బ్రిడ్డి క్రిందికి వెళదామనుకున్నాడు కానీ-లేవలేకపోయాడు కాళ్లు కదల్లేదు, వొళ్ళు తూలుతుంది పడిపోతానేమో అనుకొన్నాడు

ఆ రోజు ఉదయంనుండి నారయ్యకు ఒంట్లో బాగోలేదు జ్వరం వచ్చింది కాళ్ళు పట్టుకుపోయాయి అందుకే పొద్దుట్నుంచీ అన్నం తినలేదు నీళ్ళు తాగి పడివున్నాడు

బాగా నీరసంగా వుంది

ఓ నిమిషం కాగానే కూర్చున్నవాడల్లా గోనెపట్టాలు సరిచేసుకుని పక్కనేవున్న మూటను తలక్రింద ఉంచుకుని మేనువాల్చాడు

రోడ్డుమీద సంచారం తగ్గిపోయింది. అప్పుడప్పుడు లారీలు, ఇతర వాహనాలు వెళుతున్నాయి

ప్రక్కనేవున్న మురుగు కాలువలో గిలకోళ్ళు చెవులు పగిలేలా అరుస్తున్నాయి

నారయ్య కళ్ళు మూతలు పడుతున్నాయి

మర్రిచెట్టు మెల్లగా కదులుతోంది.

నారయ్యకు నిద్రవస్తోంది

మనసులో వాన వస్తుందేమోనన్న భయం ఓ అరగంట తరువాత నారయ్య భయపడినంతా జరిగింది.

ఉన్నట్టుండి వాన మొదలయ్యింది.

నారయ్య గబుక్కున లేచాడు. పక్కనేవున్న కర్రను అందుకొన్నాడు. మరోచేతితో గోనెపట్టాను, మూటను తీసుకొన్నాడు మెల్లగా కదిలాడు ఎలాగో మర్రిచెట్టు క్రిందికి చేరాడు

వాన బాగా పెద్దదయింది

మర్రిచెట్టుక్రింద పట్టా పరుచుకొని కూలబడ్డాడు చలిగాలి నారయ్యను వొణికించేస్తోంది

ఓ వైపు జల్లు

మరోవైపు చలి

మూటలోంచి ఓ చినిగిపోయిన గుడ్డ తీసి వంటికి కప్పుకొని వుండచుట్టుకొని పడుకొన్నాడు

వానదేముడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు అంత వానలోనూ, ఎవరో

ఓ మనిషి పరిగెత్తుకుంటూ ఆ చెట్టు క్రిందకు వచ్చాడు

"ఎవరూ ?" అన్నాడు నారయ్య నీరసంగా

వచ్చిన మనిషి మాట్లాడలేదు

ఆ చీకటిలో నారయ్యకు అతను యమభటుడిలా కనిపించాడు

"ఎవరా మడిసి ?" నారయ్య మళ్ళీ అడిగాడు

"ఎవరయితే నీకేటి ?" కసురుకున్నాడతను

నారయ్య మాట్లాడలేదు

అతనికి భయంవేసింది

తలక్రిందవున్న మూట బరువుగా కదిలినట్లనిపించింది మూటకేసి తలను గట్టిగా అదిమాడు

ఆ మూటలో నారయ్య ప్రాణం ఉంది అంటే అతను ఇన్నాళ్ళనుంచీ కష్టపడి అడుక్కొని కూడబెట్టుకున్న సంపాదన ఉంది

ఒక రోజుదికాదు, రెండు రోజులది కాదు ఎన్నో వందల రోజుల సంపాదన

ఎంతోమందిబాబులు చీదరించుకున్నా కసురుకున్నా లెక్కచేయక అన్నింటిని వదిలి దీనంగా చేతులుచాచి అడుక్కొన్న కష్టార్జితం

ఆ సంపాదన ఎవర్కోసమో నారయ్యకు తెలియదు అసలు నారయ్యకు ఎవరూలేరు

కేవలం తన తృప్తికోసం తన సంపాదన కూడబెడుతున్నాడు.

తను ఇంత—అంటే మూడొందల రూపాయలకు పైగా కూడబెట్టినట్టు ఎవ్వరికీ తెలీదు ముష్టోడి దగ్గర అంత డబ్బుందని ఎవ్వరూ అనుకోరు అందుకు నారయ్య చెప్పలేనంతగా గర్వపడతాడు ఆ డబ్బుతో ఏం చెయ్యాలో అతనికి తెలియదు.

"రేడియో కొనుక్కుంటే" అనుకొన్నాడు కానీ—ముష్టోడిదగ్గిర రేడియో వుంటే ఎవ్వరూ ముష్టెయ్యరని కొన్లేదు. ఆ తర్వాత వాచీ కొనాలనుకొన్నాడు—బంగారపు ఉంగరం చేయించుకోవాలనుకొన్నాడు ఇంకెన్నెన్నో కొనాలనుకొన్నాడు ఏవీ కొనలేదు

రోజుకోసారి ఆ మూడొందలరూపాయలను చూసుకొని మురిసిపోతున్నాడు తను ముష్టివాడిననే విషయాన్ని తాత్కాలికంగా మరచిపోతున్నాడు

ఆ మూడొందలు నారయ్య ప్రాణం

ఇప్పుడా ప్రాణం మూటలోవుంది

"మూటలో డబ్బున్నట్టు ఈడికి తెలిసి రాలేదుకదా ?" అనుకొన్నాడు నారయ్య

అతని మనసు కీడును శంకించింది

అతను చలితో కాకుండా—భయంతో కూడా వొణికిపోయాడు

వాన నిమిష నిమిషానికీ పెరుగుతుంది

విసురుగా గాలి వీస్తొంది

కరెంటు తీగెలు వూగుతున్నాయి కొంచెంసేపటి తర్వాత వీధిదీపాలు ఆరిపోయేయి

అంతా చీకటి

నారయ్య తలక్రింది మూటను తీసి గుండెలకు కరుచుకొన్నాడు

ఎవరో దగ్గరకు వచ్చిన అలికిడి అయింది నారయ్య చేతులు మూట చుట్టూ బిగుసుకుపోయేయి

"ఎవరూ ?" అనబోయేడు నారయ్య

అతనిమాట బయటకురాలేదు అప్పటి వరకూ అక్కడ నిల్చున్న మనిషి రెండు చేతులతో నారయ్య తలమీద బలంగా కొట్టాడు

లేవబోయినవాడల్లా చిన్నగా మూలిగి వెనక్కి పడిపోయేడు నారయ్య చేతుల్లోంచి మూట జారిపోయింది ఆ మనిషి మూటను తీసుకొని అంత వానలోనూ గబగబ వెళ్ళిపోయాడు

రోడ్లన్నీ నీళ్ళతో నిండిపోయాయి

నారయ్యలో చలనంలేదు

ఎప్పుడో రాత్రి రెండుగంటలుదాటిన తర్వాత వాన తగ్గింది

తెల్లవారేసరికి మర్రిచెట్టుక్రింద నారయ్య చచ్చిపోయున్నాడు చలితో నారయ్య శరీరం నీలుక్కుపోయినట్లుంది

అప్పటికప్పుడే నారయ్య శవంచుట్టూ ముగ్గురు మనుషులు పోగయ్యారు

పొద్దెక్కుతోంది సూర్యుడు ఆకాశం మీదకు పాకుతున్నాడు రోడ్డుమీద జన సంచారం పెరుగుతోంది

నారయ్యముఖం బయటకు కనిపిస్తోంది మిగిలిన శరీరం గుడ్డతో కప్పబడింది

శవంముందు ఓ గుడ్డను పరిచారు. దానిమీద వాళ్ళే ముందుగా ఐదు, పది పైసల నాణాలను విసిరారు

రోడ్డున పోయే వాళ్ళు నారయ్య శవాన్ని జాలిగా చూస్తున్నారు

"దిక్కులేనోడు బాబూ చచ్చిపోనాడు దరమం సెయ్యండి" అరుస్తున్నారు వాళ్ళు

జాలిగా అడుగుతున్నారు

"రేత్తిరి కురిసిన వానకు నీలుక్కుపోయి సచ్చిపోనాడు బాబూ, తలా ఓ పైసా పడెయ్యండి పుణ్యముంటుంది"

"ముసిలోడు బాబూ మనతోటి మడిసి"

రకరకాలుగా అరుస్తున్నారు

కొంతమంది వినిపించుకోకుండా వెళుతున్నారు మరికొంతమంది జాలిగుండె గలవాళ్ళు పది, ఐదు పైసల బిళ్ళలను పరచిన గుడ్డమీదకు విసురుతున్నారు

మధ్యాహ్నం ఒంటిగంటయింది

అప్పటికి పదహారు రూపాయలు వసూలయినాయి నారయ్య శవంమీద ఈగలు వాలుతున్నాయి

"ఇంకెంతసేపు వుంచుదాం ?" అడిగాడొకడు మిగిలిన ఇద్దరినీ

"ఇప్పుడే వదిలెట్టి ఎట్టా ఎడతాం?" అన్నాడింకొకడు

"మరెందాకా?"

"సీకటిపడినాక వదిలేద్దాం"

"పెద్దాసుపత్రి కాదయితే మంచి కలెక్సనొచ్చేది"

"ఈడయినా పర్వాలేదులే"

వీళ్ళిలా మాట్లాడుకుంటున్నప్పుడే ఇద్దరు మనుషులు అక్కడకు వచ్చారు

ఆ ముగ్గురిలో ఇద్దరిని శవానికి దూరంగా తీసుకువెళ్లారు "ఏటీ" అడిగాడొకతను వాళ్ళిద్దరూ ఎందుకు వచ్చారో తెలీక

"శవం కావాలి" అన్నాడు వాళ్ళిద్దర్లో ఒకడు

"ఈ శవమా?"

"అవును ఇదే ఎంత కిస్తారు?"

"మీరే సెప్పండి రేత్తిరే సచ్చిపోయింది"

"అట్టాకాదు నువ్వే సెప్పు ఎంత?"

"సీకటడిందాకా ఈడుంచితే మాకు వుంకో పదయినా కలెక్సనుంటుంది అందుకని ఏడు రూపాయలిచ్చి తీసికెళ్ళండి అన్నాడతను"

వాళ్ళిద్దరూ అందుకు ఒప్పుకున్నారు

అతను జేబులోంచి ఏడురూపాయలు తీసిచ్చాడు తర్వాత ఇప్పుడే వస్తామని వెళ్ళిపోయేరు

"ముసిరోడు బాగానే సంపాయించినాడు" అనుకొన్నారు ముగ్గురూ

ఓ పావుగంట తర్వాత ఆ ఇద్దరూ లాగుడుబండిని తీసుకువచ్చారు

చెరోవయిపు పట్టుకొని నారయ్య శవాన్ని బండిలో పెట్టారు పైన గుడ్డ కప్పారు

ఆ ముగ్గురూ వెళ్ళిపోయారు

బండి ముందుకు కదిలింది

కొందరు మనుషులు కేవలం అడుక్కోవటానికే పుడతారు జీవితంలో వాళ్ళవి ఎప్పుడూ "అడుగు చేతులే" సంపాదించినా వాళ్ళకు అనుభవించడం తెలీదు ఆ సంపాదన, ఆ మనుషులు మరెవరికో ఉపయోగపడవలిస్సిందే చచ్చిపోయినా అడుక్కోవడం వదలని బ్రతుకులు

హుషారుగా బండిని నెడుతున్నారు వాళ్ళు

మరో సెంటర్లో - మరో ఇద్దరికి డబ్బులు సంపాదించి పెట్టడానికి వెళుతోంది నారయ్య శవం—